క్లుప్తంగా

అంబర్, గుట్కా ప్యాకెట్లు పట్టివేత

కమలాపూర్ : మండలంలోని కన్నూరులో శుక్రవారం అంబర్, గుట్కా ప్యాకెట్లు పట్టుకుని ఒకరిపై కేసునమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కన్నూరులో అంబర్, గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు జీడీ సహదేవ్ కిరాణాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. అతని వద్ద రూ.3,540 విలువ చేసే అంబర్, గుట్కా ప్యాకెట్లు లభించాయని, వాటిని స్వాధీనం చేసుకుని సహదేవ్‌పై కేసున మోదు చేసినట్లు తెలిపారు.

ఎదురెదురుగా ద్విచక్రవాహనాల ఢీ



శాయంపేట : ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సంఘటన మండలంలోని అప్పయ్యపల్లి గ్రామ శివారు మలుపుల వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలం దామెరంచపల్లి గ్రామానికి చెందిన కునూరి శ్యాంసుందర్ ఈ-కామ్ ఎక్స్‌ప్రెస్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం డెలివరీ ఇచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అప్పయ్యపల్లి గ్రామ శివారు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్యాంసుందర్ కాలు విరిగింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా ఈఎంటీ తక్కల నరేష్, పైలెట్ రాజు ప్రథమ చికిత్స చేసి వరంగల్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు.

వరికొయ్యలను కాల్చొద్దు

ఎల్కతుర్తి : రైతులు వరికొయ్యలను కాల్చొద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎకరానికి 50 కిలోల ఎస్ఎస్‌పీ, 10–15 కిలోల యూరియా వరికొయ్యల అవశేషాలపై చల్లాలని సూచించారు. నీటి తడి ద్వారా డీ కంపోజింగ్ వేగవంతం చేయాలని, వరి అవశేషాలను రోటావేటర్ ద్వారా మట్టిలో కలియదున్నాలని తెలిపారు. దీని ద్వారా భూమిలో పోషకాలు విడుదలవుతాయని, 20–30 రోజుల్లో వరికొయ్యల అవశేషాలు పూర్తిగా కుళ్లిపోతాయని తెలిపారు.

అవగాహనలేని వారితో ఇంటింటి సర్వే

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే అవగాహనలేని వారితో చేపించారని బహుజన స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కులగణన సర్వేలో కుటుంబాల ఆస్తులకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. నిరుద్యోగులకు, కూలీలకు కూడా నెలకు 50వేల ఆదాయం ఎక్కడి నుంచి వస్తున్నాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 23న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. దర్గా, హౌజింగ్ బోర్డు కాలనీ, బియాబాని నగర్, గాంధీనగర్, బీజేపీ క్వార్టర్స్, భీమ్‌నగర్, పీఎఫ్ కార్యాలయం రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, నగర శివారు అన్సారీ ట్రస్టు, గాయత్రినగర్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు జేఎన్ఎస్‌లో గ్రామీణ క్రీడలు

వరంగల్ స్పోర్ట్స్ / కాజీపేట: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్న క్రీడా పోటీలను భారతీయ మహిళా కళాత్మక జిమ్నాస్ట్ బుడ్డ అరుణ ప్రారంభించనున్నట్లు ఈశా వలంటీర్ శిరీష తెలిపారు. మరిన్ని వివరాలకు 70324 58118, 85009 85067 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బంధువులకు మహిళ అప్పగింత

కాజీపేట అర్బన్: హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో ఒంటరిగా ఉన్న మహిళను బంధువులకు సఖి సెంటర్ సిబ్బంది అప్పగించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సఖి సెంటర్ సిబ్బంది హైమావతి కథనం ప్రకారం హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో గురువారం ఓ మహిళ ఒంటరిగా కూర్చుని ఉన్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి సమాచారం మేరకు అక్కడి వెళ్లి ఆ మహిళను హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని సఖి వన్‌స్టాప్ సెంటర్ కార్యాలయానికి తరలించారు. ఆమెకు తాత్కాలిక వసతి అందజేసి, కౌన్సెలింగ్ నిర్వహించగా తాను నర్సంపేటవాసిగా వివరాలు తెలపడంతో పాటు తన కూతురు భర్త ఫోన్ నంబర్ చెప్పింది. మహిళ అల్లుడికి ఫోన్ ద్వారా సమాచారం అందజేసి శుక్రవారం అప్పగించినట్లు హైమావతి వివరించారు. దీంతో పలువురు ఆమెను అభినందించారు.

గ్రామాల్లో కానరాని కల్లాలు

- ఆశించిన స్థాయిలో పూర్తికాని నిర్మాణాలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతులు

నడికూడ : వరికోతలు దాదాపు పూర్తి అవడంతో ధాన్యం కొనుగోళ్లకు సమయం ఆసన్నమైంది. ఈ క్రమంలో ధాన్యం ఆరబోసేందుకు కల్లాలు కరువయ్యాయి. దీంతో రైతులు అనేక పాట్లు పడాల్సి వస్తోంది. గత్యంతరం లేక రోడ్లపై ధాన్యం ఆరబోస్తే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు హెచ్చరిస్తుండడడంతో ఎక్కడ ఆరబెట్టాలో తెలియని పరిస్థితి దాపురించిందని పలువురు రైతులు వాపోతున్నారు. కాగా గత ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు పొలంలోనే కల్లాలను ఏర్పాటు చేయాలని భావించగా ఆశించిన స్థాయిలో పూర్తికాలేదు. చిన్న, సన్నకారు రైతులకు లబ్ధి చేకూరేలా కల్లాల నిర్మాణం చేపట్టాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 50 చదరపు మీటర్ల వైశాల్యంలో కల్లాల నిర్మాణానికి రూ.68 వేలు, 60 చదరపు మీటర్ల వైశాల్యంలో నిర్మాణానికి రూ.75 వేలు, 75 చదరపు మీటర్ల వైశాల్యంలో నిర్మాణానికి రూ.80 వేలు వరకు నిధులను కేటాయించినా ఫలితం పెద్దగా లేదనే విమర్శలు వస్తున్నాయి. మండల పరిధిలో 252 కల్లాలు మంజూరు కాగా కేవలం 3 పూర్తి అయ్యాయని, 5 నిర్మాణ దిశలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే పంట పొలాల వద్దనే కల్లాలను ఏర్పాటు చేసుకోవాలని అధికారులు తెలుపడంతో రైతులు వెనుకడుగు వేసినట్లు తెలిసింది. అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడం, పంట దిగుబడి పెరగడం, రైతులకు సరిపడా స్థలం లేకపోవడంతో కల్లాల ఏర్పాటుపై ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి కల్లాల ఏర్పాటుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

కల్లాలు ఏర్పాటు చేయాలి



రైతుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవాలి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఆరబోసేందుకు స్థలాలు లేవు. రోడ్డుపై ఆరబోసేందుకు అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరిస్తున్నారు. యూట్‌వైస్ కల్లాలు ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వరికెల కిషన్‌రావు, నర్సక్కపల్లి

విద్యతోపాటు సంస్కారం అలవర్చుకోవాలి

- సైకాలజిస్ట్ దామోదర్



మాట్లాడుతున్న దామోదర్

ధర్మసాగర్ : విద్యార్థులు విద్యతోపాటు సంస్కారం అలవర్చుకుంటే ఉన్నతంగా ఎదుగుతారని సైకాలజిస్ట్, సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్ అన్నారు. మండలంలోని ముప్పారం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల దశ నుంచే విద్యతో పాటు సంస్కారం, వినయం, విధేయత అలవర్చుకోవాలని సూచించారు. వృద్ధులు, తల్లిదండ్రులు, పెద్దలు, గురువుల పట్ల వినయ, విధేయతతో నడుచుకోవాలని అన్నారు. జీవితాలను విచ్ఛిన్నం చేసే తప్పుడు పోకడలకు, తప్పుడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. అపరిచితులు ఆహ్వానిస్తే బైక్ ఎక్కడం, తినుబండారాలు తీసుకోవడం మంచిదికాదన్నారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సువర్ణ అధ్యక్షత వహించగా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి యుగేందర్, కార్యవర్గసభ్యులు లక్ష్మీనారాయణ, స్వామి, రిటైర్డ్ హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను కించపరిస్తే సహించం



మాట్లాడుతున్న ఇట్టబోయిన సంపత్

వేలేరు : ముదిరాజ్‌లను కాంగ్రెస్ పార్టీ నాయకులు కించపరిచే వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని ముదిరాజ్ సొసైటీ చైర్మన్ ఇట్టబోయిన సంపత్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ కమ్యూనిటీ భవనంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సంవత్సరం క్రితం మండల కేంద్రంలో నిర్మించిన పెద్దమ్మతల్లి గుడి నిర్మాణంపై ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు అభ్యంతరకర వాఖ్యలు చేశారని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న రాజకీయ వైరుధ్యాలను రాజకీయంగానే చూసుకోవాలని, పెద్దమ్మతల్లి విగ్రహాలపై రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు గుండు భిక్షపతి ముదిరాజ్, ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు రాజు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలి

- డీఎస్పీ నాయకులు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శాయంపేట : రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు ఇవ్వాలని ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు మాల్యాల అమరేందర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అమరేందర్ మట్లాడుతూ.. తెలంగాణలో 90శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాలు ఉన్నాయని, వారికి విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు తదితర సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పేదలందరికీ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, వైద్యం అందించాలని, అర్హతను బట్టి ఉపాధి కల్పించి, సాగునీటి సౌకర్యంతో కూడిన ఎకరం భూమి ఇవ్వాలని, అర్హులైన వారికి 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన అధికారులు

సాక్షి స్పందన

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరు వాగు వద్ద రోడ్డు డైవర్షన్ కోసం తాత్కాలికంగా నిర్మించిన వంతనపై గుంత పడిన విషయం తెలిసిందే. కాగా నవంబర్ 19న సాక్షి దినపత్రికలో 'ప్రమాదకరంగా గుంత' అనే కథనాన్ని ప్రచురితం చేసింది. దీంతో స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు శుక్రవారం గుంతలను పూడ్చివేశారు.



గుంతలను పూడ్చిన సిబ్బంది

సంక్షిప్తంగా

ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలి



శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మండల ఇన్‌చార్జ్ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యల తెలుసుకునేందుకు పాఠశాలకు వెళ్లగా లోపలికి రాన్వినకుండా అడ్డుకుంటూ విద్యార్థుల సమస్యలను తెలియనివ్వకుండా జాగ్రత్త పడుతున్నారని ఆరోపించారు. విద్యార్థులను సైతం వివిధ రకాలుగా భయాందోళనలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు హేమంత్, బొచ్చు ఈశ్వర్ పాల్గొన్నారు.

స్వర్ణలతకు జాతీయ అవార్డు



ఎల్కతుర్తి : మండలంలోని దామెర గ్రామానికి చెందిన మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వర్ణలత శుక్రవారం జాతీయ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడలో నిర్వహించిన జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌లో భాగంగా నేషనల్ ఇన్స్‌ట్యూట్ ఆఫ్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రెస్ సంస్థ 24 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ మహేపరాలి, ఉపాధ్యాక్షుడు శ్రీపాల్ థామస్, ఎండీ, సీఈఓ సీఎస్, రెడ్డి చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. షీల్డ్‌తో పాటు లక్ష బహుమతి, ప్రశంసపత్రం అందుకున్నట్లు ఏపీఎం రవీందర్ తెలిపారు. మండల సమాఖ్య కోశాధికారి శైలజ, అదనపు ప్రాజెక్టు అధికారి సుధీర్‌కుమార్, అనిల్ పాల్గొన్నారు.

పరామర్శ

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో కందికొండ సాంబయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామంలో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో సుమారు 30 వరకు బెల్టుషాపులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే గురువారం ఎక్సైజ్ అధికారులు ఫిర్యాదు అందిందని తెలుపుతూ ఒకే వ్యక్తిని మాత్రమే బైండోవర్ చేయడం ఏంటని పలువురు చర్చించుకుంటున్నారు. బెల్ట్‌షాపులను నిర్మూలించాల్సిన ఎక్సైజ్‌శాఖ అధికారులు మామూళ్లమత్తులో పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నారు. వెంకటాపూర్ గ్రామంలో గల వైన్ షాపు నుంచి మద్యం సరఫరా అవుతుందని, సిండికేట్ వ్యాపారం కోసం అక్రమ దందాకు తెరలేపుతున్న వైన్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వనభోజన మహోత్సవం



ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన నవనాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో సర్ప దోషాలకు ప్రత్యేక పరిహారంగా కార్తీకమాసం అశ్లేష నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయ వ్యవస్థాపకుడు గంట సీతారామారావు రాధాదేవి ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర ఘటాభిషేకం అశ్లేష బలిపూజ, కార్తీకమాస వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండారు రాంప్రసాద్‌రావు, రాజ్ గణేశ్, రవీందర్‌రెడ్డి, రమణారెడ్డి, అమరేందర్‌రెడ్డి, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ పిన్నపురెడ్డి అవనిజవిప్లవ్‌రెడ్డితో పాటు భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక




ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం డాక్టర్ రమేశ్ తెలిపారు. జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మాదాసి ఋషి, పిండి వర్షిత్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని, నేటి నుంచి 24 వ తేదీల్లో మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఏఏపీసీ అధ్యక్షురాలు పద్మావతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అభినందించారు.

కరపత్రం ఆవిష్కరణ

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ గ్రామంలో భారత రాజ్యాంగ పరిరక్షణయాత్ర కరపత్రాన్ని అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ శుక్రవారం ఆవిష్కరించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఈనెల 26వ తేదీ యాత్ర ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర ఎల్కతుర్తి నుంచి ప్రారంభమై భీమదేవరపల్లి, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్ మీదుగా హుస్నాబాద్‌కు చేరుకొని అంబేద్కర్ చౌరస్తాలో ముగింపు సభ ఉంటుందని పేర్కొన్నారు.

అంతరాయం కలుగకుండా ముందుజాగ్రత్తలు



హన్మకొండ: వచ్చే వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరిగి అంతరాయం ఏర్పడకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.వెంకటరమణ అన్నారు. హనుమకొండ యాదవనగర్ సబ్ స్టేషన్ సామర్థ్యం పెంపులో భాగంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. వినియోగదారులకు ఏమైనా సమస్యలుంటే 1912 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భద్రతా చర్యలు తప్పనిసరి : ఏసీపీ



మాట్లాడుతున్న పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్

పరకాల : బ్యాంక్‌లు, ఫైనాన్స్ సంస్థలు భద్రతా చర్యలు తీసుకోవాలని ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం బ్యాంక్‌లు, ఫైనాన్స్ సంస్థల అధికారులతో మాట్లాడారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని బ్యాంక్‌లు, ఫైనాన్స్ సంస్థల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్రతి బ్యాంక్, ఫైనాన్స్ సంస్థల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానిత వ్యక్తులపై ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల సీఐ క్రాంతికుమార్, ఎస్సై శివకృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

తూకంలో తేడా రావొద్దు : సీఐ



పరకాల : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ క్రాంతికుమార్



దామెర : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి

పరకాల : ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకంలో తేడా రాకుండా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సీఐ క్రాంతికుమార్ అన్నారు. మండలంలోని నాగారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులకు అందుతున్న సదుపాయాలతో పాటు ఏమైనా కాంటాల అవకతవకలు జరుగుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భిక్షపతి, ఏఈఓ రాజు పాల్గొన్నారు.

దామెర : ఆరుగాలం కష్టపడి పంటసాగు చేసిన రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. మండలంలోని సింగరాజుపల్లిలో సిరి గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. సన్నాలు పండించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏపీఎం ఝాన్సీ, ఏఈఓ రాజేష్, నాయకులు సత్యనారాయణ, వేణు, సత్యం, శ్రీనివాస్, రైతులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై ఏకాగ్రత వహించాలి

- ఆర్డీఓ రమేశ్‌రాథోడ్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రమేశ్‌రాథోడ్

ఎల్కతుర్తి : విద్యార్థులు చదువుపై ఏకాగ్రత వహించాలని ఆర్డీఓ రమేశ్‌రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కిచెన్‌షెడ్‌ను పరిశీలించి వెంటనే వినియోగం తీసుకురావాలని సూచించారు. అనంతరం పదోతరగతి విద్యార్థుల సంఖ్య పాఠశాలలో ఎంత ఉందని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత వహించి పరీక్షల్లో ఉత్తమ మార్కులు, ర్యాంక్‌లు సాధించాలన్నారు. తహసీల్దార్ జగత్‌సింగ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పురాతన ఆలయాల పరిరక్షణ అందరి బాధ్యత



పూజలు చేస్తున్న ఏడీ మల్లునాయక్

ఆత్మకూరు : పురాతన ఆలయాల పరిరక్షణ అందరి బాధ్యత అని పురావస్తు శాఖ ఏడీ మల్లునాయక్ అన్నారు. మండల కేంద్రంలో పునర్మిరాణం పూర్తిచేసుకొని ఇటీవల పునఃప్రతిష్ఠాపనైన పంచకూట శ్రీపార్వతీదేవి సమేత మహాదేవ స్వామి ఆలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. పురాతన ఆలయాలు మహిమాన్వితమని అన్నారు. ఆత్మకూరు పంచకూట శివాలయానికి ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రవీందర్‌శర్మ, శ్రావణ్‌శర్మ, చరిత్ర పరిశోధకుడు అరవింద్‌పకిడే పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం



గ్యాస్‌సిలిండర్ పేలడంతో దగ్ధమైన ఇల్లు

కమలాపూర్ : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని భీంపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. భీంపల్లికి చెందిన బోళ్ల సంపత్ ఇంట్లో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి దట్టమైన పొగలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన అక్కడకు చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి జమ్మికుంట ఫైరింజన్ సహాయంతో మంటలు అదుపుచేశారు. అప్పటికే ఇంటితో పాటు ఇంట్లోని సామాగ్రి, ఆ పక్కనే ఉన్న మొగిలి కిరాణా దుకాణంలోని రెండు ఫ్రిడ్జ్‌లు, ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్యాస్ సిలిండర్ పేలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ప్రమాదంలో మొత్తంగా రూ.50 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని పోలీసులు, బాధితులు తెలిపారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



వెంకటాపూర్‌లో పశువులకు చికిత్స చేస్తున్న డాక్టర్ దీపిక

దామెర : మండలంలోని ప్రజలు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ దీపిక అన్నారు. పశుగణాభివృద్ధి, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వెంకటాపూర్, సింగరాజుపల్లిలో శుక్రవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. 46 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులు ఎదకు వచ్చినప్పుడు లింగనిర్ధారిత వీర్యంతో ఇంజక్షన్ చేయాలని సూచించారు. దీంతో మేలురకం జాతి ఆడదూడలు వృద్ధి చెందుతాయని వెల్లడించారు. రైతులు గోపాల మిత్ర సేవలు వినియోగించుకోవాలని సూచించారు. వీఎల్ఓ లక్ష్మణ్, ఎల్ఎస్ఏ సిరాజుద్దీన్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ప్రకాశ్‌రెడ్డి, గోపాలమిత్రలు గోపు సతీష్, కుమారస్వామి రైతులు పాల్గొన్నారు.